# శ్రీ రాముడు
# సుగుణాభిరాముడు



శ్రీమాన్ శ్రీభాష్యం అప్పలాచార్యులు, ఎం. ఏ.,
విశాఖపట్నం వారి
" సుందరకాండ - తత్త్వదీపిక "
నుండి గ్రహింపబడినది.

శ్రీరాముడు సుగుణాభిరాముడు



శ్రీ కాసరబాద కామరాజుగారి

స్మారకముగ

— సమర్పణము —

ధర్మపత్ని కాసరబాద జగదాంబ,

కుమారుడు శ్రీ చలపతిరావు,

కుమార్తె డాక్టరు సుబ్బలక్ష్మి

కర్నూలు.

శ్రీమాన్ శ్రీభాష్యం అప్పలాచార్యులు, ఎమ్. ఏ.,

విశాఖపట్నం వారి

" సుందరకాండ – తత్త్వదీపిక "

నుండి గ్రహింపబడినది.

శ్రీపతి ప్రెస్,
కాకినాడ-1.

ప్రతులు : 1000

# ఆమోదము

శ్రీరామాయణము మానవతా సర్వస్వము. మానవజన్మ దుర్లభము. అది లభించినవారు అసుర భావావిష్టులు కాకుండ దైవభావావేశముతో నుండుట సుకృత పరిపాకము. అట్టివారికి శ్రీరామాయణము రుచించును. సాక్షాత్తు భగవానుడే శ్రీరాముడను పేర దశరథాత్మజుడై అవతరించినాడు. అసురత్వమును నిరసించి దైవత్వమును సర్వత్ర ప్రతిష్ఠించినాడు సకల కళ్యాణ గుణాభిరాముడు శ్రీరాముడు. ఆ గుణములను తెలిసికొనినచో మనలో మానవత్వము నెలకొని దైవభక్తి కలుగును. శ్రీరామాయణ ప్రారంభము శ్రీరాముని గుణప్రస్తావముతో సాగినది. 16 గుణములు వాల్మీకి ప్రస్తావించి ఈ గుణములు కలవాడు ఇప్పుడు ఈ లోకములో ఉన్నాడా? అని నారదుని ప్రశ్నించినాడు. ఆ గుణముల వివరణమే ఈ చిన్ని పుస్తకము.

శ్రీ కాసరబాదా రామరాజు. కర్నూలువారి ధర్మపత్నియు, కుమారుడు చిరంజీవి చలపతిరావు, కుమార్తె చి॥ సౌ॥ డాక్టరు సుబ్బలక్ష్మి గారలు రామరాజుగారి స్మారకముగా ఈ గ్రంథమును అచ్చువేయించి శ్రీరామగుణామృతమును లోకమునకు పంచియిచ్చిరి. వారి శ్రీరామచంద్ర గుణాసక్తికి ఎంతో ఆనందము

కలిగి నే నామోదించితిని. వారి జీవితము ధన్యము, దీనిని చదివి శ్రీరామచంద్ర గుణములను అనుభవించవలెను అను కోరిక గలవారు ధన్యులు. వారికి అనేక మంగళాశాసనములు. శ్రీ మద్దుల సుబ్రహ్మణ్యం కాకినాడవారు ప్రకటించుటలో బాధ్యత వహించినారు. వారికి మా మంగళాశాసనములు.

శ్రీ ప్రజోత్పత్తి చైత్ర శుద్ధ నవమీ, ఇట్లు,
శ్రీరామనవమి శ్రీభాష్యం అప్పలాచార్యులు, ఎమ్. ఏ.,
ది. 24 మార్చి 1991

శ్రీరామాయ నమః

# శ్రీరామాయణ ప్రార్థనా శ్లోకములు

## విష్వక్సేన ధ్యానమ్

శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోపశాంతయే.
యస్య ద్విరదవక్త్రాద్యాః పారిషద్యాః పరశ్శతమ్
విఘ్నం నిఘ్నంతి సతతం విష్వక్సేనం తమాశ్రయే.

## వాల్మీకి ధ్యానమ్

కూజంతం రామ రామేతి మధురం మధురాక్షరమ్
ఆరుహ్య కవితాశాఖాం వందే వాల్మీకికోకిలమ్.
వాల్మీకే ర్మునిసింహస్య కవితా వనచారిణః
శృణ్వన్ రామకథానాదం కో న యాతి పరాం గతిమ్.
యః పిబన్ సతతం రామచరితామృతసాగరమ్
అతృప్తస్తం మునిం వందే ప్రాచేతస మకల్మషమ్.

## ఆంజనేయ ప్రార్థనా

గోష్పదీకృతవారాశిం మశకీకృతరాక్షసమ్
రామాయణ మహామాలారత్నం వందేఽనిలాత్మజమ్.
అంజనానందనం వీరం జానకీశోకనాశనమ్
కపీశ మక్షహంతారం వందే లంకాభయంకరమ్.
అమిషీకృతమార్తాండం గోష్పదీకృతసాగరమ్
తృణీకృతదశగ్రీవ మాంజనేయం నమామ్యహమ్.

మనోజవం మారుతతుల్యవేగం జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠమ్
వాతాత్మజం వానరయూథముఖ్యం శ్రీరామదూతం శిరసా నమామి.

ఉల్లంఘ్య సింధోః సలిలం సలీలం యః శోకవహ్నిం జనకాత్మజాయాః
ఆదాయ తేనైవ దదాహ లంకాం నమామి తం ప్రాంజలి రాంజనేయమ్.

ఆంజనేయ మతిపాటలాననం కాంచనాద్రికమనీయవిగ్రహమ్
పారిజాతతరుమూలవాసినం భావయామి పవమాననందనమ్.

యత్ర యత్ర రఘునాథకీర్తనం తత్ర తత్ర కృతమస్తకాంజలిమ్
బాష్పవారిపరిపూర్ణలోచనం మారుతిం నమత రాక్షసాంతకమ్.

## శ్రీ రామ ప్రార్థన

శ్రీరాఘవం దశరథాత్మజ మప్రమేయం
సీతాపతిం రఘుకులాన్వయరత్నదీపమ్
ఆజానుబాహు మరవిందదళాయతాక్షం
రామం నిశాచరవినాశకరం నమామి.

వైదేహీసహితం సురద్రుమతలే హైమే మహామండపే
మధ్యే పుష్పకమాసనే మణిమయే వీరాసనే సుస్థితమ్
అగ్రే వాచయతి ప్రభంజనసుతే తత్త్వం మునిభ్యః పరం
వ్యాఖ్యాంతం భరతాదిభిః పరివృతంరామం భజే శ్యామలమ్.

వామే భూమిసుతా పురశ్చ హనుమాన్ పశ్చాత్ సుమిత్రాసుత
శ్శత్రుఘ్నో భరతశ్చ పార్శ్వదళయో ర్వాయ్వాదికోణేషు చ,
సుగ్రీవశ్చ విభీషణశ్చ యువరాట్తారాసుతో జాంబవా
న్మధ్యే నీలసరోజకోమలరుచిం రామం భజే శ్యామలమ్.

మాతా రామో మత్పితా రామచంద్రో
భ్రాతా రామో మత్సఖా రాఘవేశః

సర్వస్వం మే రామచంద్రో దయాళుః
నాన్యం దైవం నైవ జానే న జానే.

సాకేతే శరదిందుకుంద ధవళే సౌధే మహామండపే
పర్యస్తాగరుధూపదీపలలితే కర్పూరదీపోజ్జ్వలే
సుగ్రీవాంగదజాంబవత్ప్రవిధృతం సౌమిత్రిణా సేవితం
లీలామానుషవిగ్రహం రఘువరం రామం భజే శ్యామలమ్.

నమోఽస్తు రామాయ సలక్ష్మణాయ
దేవ్యై చ తస్యై జనకాత్మజాయై
నమోఽస్తు రుద్రేంద్రయమానిలేభ్యో
నమోఽస్తు చంద్రార్కమరుద్గణేభ్యః.

ఆపదామపహర్తారం దాతారం సర్వసంపదాం
లోకాభిరామం శ్రీరామం భూయో భూయో నమామ్యహమ్.

## జయ మంత్రము

జయత్యతిబలో రామో లక్ష్మణశ్చ మహాబలః
రాజా జయతి సుగ్రీవో రాఘవేణాభిపాలితః.

దాసోఽహం కోసలేంద్రస్య రామస్యాక్లిష్టకర్మణః
హనుమాన్ శత్రుసైన్యానాం నిహంతా మారుతాత్మజః.

న రావణసహస్రం మే యుద్ధే ప్రతిబలం భవేత్
శిలాభిస్తు ప్రహరతః పాదపైశ్చ సహస్రశః.

అర్దయిత్వా పురీం లంకామభివాద్య చ మైథిలీం
సమృద్ధార్థో గమిష్యామి మిషతాం సర్వరక్షసామ్.

ధర్మాత్మా సత్యసంధశ్చ రామో దాశరథిర్యది
పౌరుషే చాప్రతిద్వంద్వశ్శరై నం జహి రావణిమ్.

# శ్రీమద్రామాయణే, బాలకాండే

## సంక్షేప రామాయణమ్

తపస్స్వాధ్యాయనిరతం తపస్వీ వాగ్విదాం వరమ్
నారదం పరిపప్రచ్ఛ వాల్మీకిర్మునిపుంగవమ్. 1

కోన్వస్మిన్ సాంప్రతం లోకే గుణవాన్ కశ్చ వీర్యవాన్
ధర్మజ్ఞశ్చ కృతజ్ఞశ్చ సత్యవాక్యో దృఢవ్రతః ? 2

చారిత్రేణ చ కో యుక్తః సర్వభూతేషు కో హితః
విద్వాన్ కః కస్సమర్థశ్చ కశ్చైకప్రియదర్శనః ? 3

ఆత్మవాన్ కో జితక్రోధో ద్యుతిమాన్ కోఽనసూయకః
కస్య బిభ్యతి దేవాశ్చ జాతరోషస్య సంయుగే ? 4

ఏతదిచ్ఛామ్యహం శ్రోతుం పరం కౌతూహలం హి మే
మహర్షే త్వం సమర్థోఽసి జ్ఞాతుమేవంవిధం నరమ్. 5

శ్రుత్వా చైతత్త్రిలోకజ్ఞో వాల్మీకేర్నారదో వచః
శ్రూయతామితి చామంత్ర్య ప్రహృష్టో వాక్యమబ్రవీత్ 6

బహవో దుర్లభాశ్చైవ యే త్వయా కీర్తితా గుణాః
మునే వక్ష్యామ్యహం బుద్ధ్వా తైర్యుక్తః శ్రూయతాం నరః. 7

ఇక్ష్వాకువంశప్రభవో రామో నామ జనైః శ్రుతః
నియతాత్మా మహావీర్యో ద్యుతిమాన్ ధృతిమాన్ వశీ. 8

బుద్ధిమాన్ నీతిమాన్ వాగ్మీ శ్రీమాన్ శత్రునిబర్హణః
విపులాంసో మహాబాహుః కంబుగ్రీవో మహాహనుః. 9

మహోరస్కో మహేష్వాసో గూఢజత్రు రరిందమః
ఆజానుబాహు స్సుశిరా స్సులలాట స్సువిక్రమః. 10

సమ స్సమవిభక్తాంగ స్స్నిగ్ధవర్ణః ప్రతాపవాన్
పీనవక్షా విశాలాక్షో లక్ష్మీవాన్ శుభలక్షణః. 11

ధర్మజ్ఞ స్సత్యసంధశ్చ ప్రజానాం చ హితే రతః
యశస్వీ జ్ఞానసంపన్న శ్శుచి ర్వశ్య స్సమాధిమాన్. 12

ప్రజాపతిసమ శ్శ్రీమాన్ ధాతా రిపునిషూదనః
రక్షితా జీవలోకస్య ధర్మస్య పరిరక్షితా. 13

రక్షితా స్వస్య ధర్మస్య స్వజనస్య చ రక్షితా
వేదవేదాంగతత్త్వజ్ఞో ధనుర్వేదే చ నిష్ఠితః. 14

సర్వశాస్త్రార్థతత్త్వజ్ఞ స్స్మృతిమా న్ప్రతిభానవాన్
సర్వలోకప్రియ స్సాధు రదీనాత్మా విచక్షణః. 15

సర్వదాభిగత స్సద్భి స్సముద్ర ఇవ సింధుభిః
ఆర్య స్సర్వసమశ్చైవ సదైక ప్రియదర్శనః. 16

స చ సర్వగుణోపేతః కౌసల్యానందవర్ధనః
సముద్ర ఇవ గాంభీర్యే ధైర్యేణ హిమవానివ. 17

విష్ణునా సదృశో వీర్యే సోమవ త్ప్రియదర్శనః
కాలాగ్నిసదృశః క్రోధే క్షమయా పృథివీసమః. 18

ధనదేన సమస్త్యాగే సత్యే ధర్మ ఇవాపరః
తమేవం గుణసంపన్నం రామం సత్యపరాక్రమమ్. 19

## అయోధ్యాకాండః

జ్యేష్ఠం శ్రేష్ఠగుణైర్యుక్తం ప్రియం దశరథ స్సుతమ్
ప్రకృతీనాం హితైర్యుక్తం ప్రకృతి ప్రియకామ్యయా. 20

యౌవరాజ్యేన సంయోక్తు మైచ్ఛత్ప్రీత్యా మహీపతిః
తస్యాభిషేకసంభారా న్దృష్ట్వా భార్యాథ కైకయీ. 21

పూర్వందత్తవరా దేవీ వరమేన మయాచత
వివాసనం చ రామస్య భరతస్యాభిషేచనమ్. 22

స సత్యవచనాద్రాజా ధర్మపాశేన సంయతః
వివాసయామాస సుతం రామం దశరథః ప్రియమ్. 23

స జగామ వనం వీరః ప్రతిజ్ఞా మనుపాలయన్
పితుర్వచననిర్దేశా త్కైకేయ్యాః ప్రియకారణాత్. 24

తం వ్రజంతం ప్రియో భ్రాతా లక్ష్మణోఽనుజగామహ
స్నేహా ద్వినయసంపన్న స్సుమిత్రానందవర్ధనః. 25

భ్రాతరం దయితో భ్రాతు స్సౌభ్రాత్ర మనుదర్శయన్
రామస్య దయితా భార్యా నిత్యం ప్రాణసమాహితా. 26

జనకస్య కులే జాతా దేవమాయేవ నిర్మితా
సర్వలక్షణసంపన్నా నారీణా ముత్తమా వధూః. 27

సీతా ప్యనుగతా రామం శశినం రోహిణీ యథా
పౌరై రనుగతో దూరం పిత్రా దశరథేన చ. 28

శృంగిబేరపురే సూతం గంగాకూలే వ్యసర్జయత్
గుహమాసాద్య ధర్మాత్మా నిషాదాధిపతిం ప్రియమ్. 29

గుహేన సహితో రామో లక్ష్మణేన చ సీతయా
తే వనేన వనం గత్వా నదీ స్తీర్త్వా బహూదకాః. 30

చిత్రకూట మనుప్రాప్య భరద్వాజస్య శాసనాత్
రమ్యమావసథం కృత్వా రమమాణా వనే త్రయః. 31

యౌవరాజ్యేన సంయోక్తుమైచ్ఛత్ప్రీత్యా మహీపతిః
తస్యాభిషేకసంభారా న్దృష్ట్వా భార్యాథ కైకయీ. 21

పూర్వం దత్తవరా దేవీ వరమేన మయాచత
వివాసనం చ రామస్య భరతస్యాభిషేచనమ్. 22

స సత్యవచనాద్రాజా ధర్మపాశేన సంయతః
వివాసయామాస సుతం రామం దశరథః ప్రియమ్. 23

స జగామ వనం వీరః ప్రతిజ్ఞా మనుపాలయన్
పితుర్వచననిర్దేశాత్ కైకేయ్యాః ప్రియకారణాత్. 24

తం వ్రజంతం ప్రియో భ్రాతా లక్ష్మణోఽనుజగామ హ
స్నేహా ద్వినయసంపన్న స్సుమిత్రానందవర్ధనః. 25

భ్రాతరం దయితో భ్రాతు స్సౌభ్రాత్ర మనుదర్శయన్
రామస్య దయితా భార్యా నిత్యం ప్రాణసమా హితా. 26

జనకస్య కులే జాతా దేవమాయేవ నిర్మితా
సర్వలక్షణసంపన్నా నారీణా ముత్తమా వధూః. 27

సీతా ప్యనుగతా రామం శశినం రోహిణీ యథా
పౌరై రనుగతో దూరం పిత్రా దశరథేన చ. 28

శృంగిబేరపురే సూతం గంగాకూలే వ్యసర్జయత్
గుహమాసాద్య ధర్మాత్మా నిషాదాధిపతిం ప్రియమ్. 29

గుహేన సహితో రామో లక్ష్మణేన చ సీతయా
తే వనేన వనం గత్వా నదీ స్తీర్త్వా బహూదకాః. 30

చిత్రకూట మనుప్రాప్య భరద్వాజస్య శాసనాత్
రమ్యమావసథం కృత్వా రమమాణా వనే త్రయః. 31

దేవగంధర్వసంకాశా స్తత్ర తే న్యవసన్ సుఖమ్
చిత్రకూటం గతే రామే పుత్రశోకాతుర స్తథా. 32

రాజా దశరథ స్స్వర్గం జగామ విలపన్ సుతమ్
మృతే తు తస్మిన్ భరతో వసిష్ఠప్రముఖై ర్ద్విజైః. 33

నియుజ్యమానో రాజ్యాయ నైచ్ఛ ద్రాజ్యం మహాబలః
స జగామ వనం వీరో రామపాదప్రసాదకః. 34

గత్వాతు సుమహాత్మానం రామం సత్యపరాక్రమమ్
అయాచ ద్భ్రాతరం రామ మార్యభావపురస్కృతః. 35

త్వమేవ రాజా ధర్మజ్ఞ ఇతి రామం వచోఽబ్రవీత్
రామోఽపి పరమోదార స్సుముఖ స్సుమహాయశాః. 36

న చైచ్ఛ త్పితురాదేశా ద్రాజ్యం రామో మహాబలః
పాదుకే చాస్య రాజ్యాయ న్యాసం దత్త్వా పునఃపునః. 37

నివర్తయామాస తతో భరతం భరతాగ్రజః
స కామ మనవాప్యైవ రామపాదా వుపస్పృశన్. 38

నందిగ్రామేఽకరో ద్రాజ్యం రామాగమనకాంక్షయా
గతే తు భరతే శ్రీమాన్ సత్యసంధో జితేంద్రియః. 39

రామస్తు పునరాలక్ష్య నాగరస్య జనస్య చ
తత్రాగమన మేకాగ్రో దండకా న్ప్రవివేశ హ. 40

## అరణ్యకాండః

ప్రవిశ్య తు మహారణ్యం రామో రాజీవలోచనః
విరాధం రాక్షసం హత్వా శరభంగం దదర్శ హ. 41

సుతీక్ష్ణం చాప్యగస్త్యం చ అగస్త్యభ్రాతరం తథా
అగస్త్యవచనాచ్చైవ జగ్రాహైంద్రం శరాసనమ్. 42

ఖడ్గం చ పరమప్రీత స్తూణీ చాక్షయసాయకౌ
వసత స్తస్య రామస్య వనే వనచరై స్సహ. 43

ఋషయోఽభ్యాగమ న్సర్వే వధాయాసురరక్షసామ్
స తేషాం ప్రతిశుశ్రావ రాక్షసానాం తథా వనే. 44

ప్రతిజ్ఞాతశ్చ రామేణ వధ స్సంయతి రక్షసామ్
ఋషీణా మగ్ని కల్పానాం దండకారణ్యవాసినామ్. 45

తేన తత్రైవ వసతా జనస్థాననివాసినీ
విరూపితా శూర్పణఖా రాక్షసీ కామరూపిణీ. 46

తత శ్శూర్పణఖా వాక్యా దుద్యుక్తా న్సర్వరాక్షసాన్
ఖరం త్రిశిరసం చైవ దూషణం చైవ రాక్షసమ్. 47

నిజఘాన రణే రామ స్తేషాం చైవ పదానుగాన్
వనే తస్మిన్నివసతా జనస్థాననివాసినామ్. 48

రక్షసా న్నిహతాన్యాస న్సహస్రాణి చతుర్దశ
తతో జ్ఞాతివధం శ్రుత్వా రావణః క్రోధమూర్ఛితః. 49

సహాయం వరయామాస మారీచం నామ రాక్షసమ్
వార్యమాణ స్సుబహుశో మారీచేన స రావణః. 50

న విరోధో బలవతా క్షమో రావణ తేన తే
అనాదృత్య తు తద్వాక్యం రావణః కాలచోదితః. 51

జగామ సహమారీచ స్తస్యాశ్రమపదం తదా
తేన మాయావినా దూర మపవాహ్య నృపాత్మజౌ. 52

జహార భార్యాం రామస్య గృధ్రం హత్వా జటాయుషమ్ ।
గృధ్రం చ నిహతం దృష్ట్వా హృతాం శ్రుత్వా చ మైథిలీమ్. 53

రాఘవః శోకసంతప్తో విలలాపాకులేంద్రియః
తతస్తేనైవ శోకేన గృధ్రం దగ్ధ్వా జటాయుషమ్. 54

మార్గమాణో వనే సీతాం రాక్షసం సందదర్శహ
కబంధం నామ రూపేణ వికృతం ఘోరదర్శనమ్. 55

తన్నిహత్య మహాబాహు ర్దదాహ స్వర్గతశ్చ సః
సచాస్య కథయామాస శబరీం ధర్మచారిణీమ్. 56

శ్రమణీం ధర్మనిపుణా మభిగచ్ఛేతి రాఘవ
సోఽభ్యగచ్ఛ న్మహాతేజాః శబరీం శత్రుసూదనః. 57

కిష్కింధాకాండః

శబర్యా పూజిత స్సమ్యగ్రామో దశరథాత్మజః
పంపాతీరే హనుమతా సంగతో వానరేణహ. 58

హనుమద్వచనాచ్చైవ సుగ్రీవేణ సమాగతః
సుగ్రీవాయ చ తత్సర్వం శంసద్రామో మహాబలః. 59

ఆదితస్తద్యథావృత్తం సీతాయాశ్చ విశేషతః
సుగ్రీవశ్చాపి తత్సర్వం శ్రుత్వా రామస్య వానరః. 60

చకార సఖ్యం రామేణ ప్రీతశ్చైవాగ్నిసాక్షికం
తతో వానరరాజేన వైరానుకథనం ప్రతి. 61

రామాయావేదితం సర్వం ప్రణయాద్దుఃఖితేన చ
ప్రతిజ్ఞాతం చ రామేణ తదా వాలివధంప్రతి. 62

2

వాలినశ్చ బలం తత్ర కథయామాస వానరః
సుగ్రీవ శ్శంకితశ్చాసీ న్నిత్యం వీర్యేణ రాఘవే. 63

రాఘవప్రత్యయార్థం తు దుందుభేః కాయముత్తమమ్
దర్శయామాస సుగ్రీవో మహాపర్వతసన్నిభమ్. 64

ఉత్స్మయిత్వా మహాబాహుః ప్రేక్ష్య చాస్థి మహాబలః
పాదాంగుష్ఠేన చిక్షేప సంపూర్ణం దశయోజనమ్. 65

బిభేద చ పునః సాలాన్ సప్తైకేన మహేషుణా
గిరిం రసాతలం చైవ జనయన్ ప్రత్యయం తదా. 66

తతః ప్రీతమనా స్తేన విశ్వస్తః స మహాకపిః
కిష్కింధాం రామసహితో జగామ చ గుహాం తదా. 67

తతో౽గర్జ ద్ధరివర స్సుగ్రీవో హేమపింగళః
తేన నాదేన మహతా నిర్జగామ హరీశ్వరః. 68

అనుమాన్య తదా తారాం సుగ్రీవేణ సమాగతః
నిజఘాన చ తత్రైనం శరేణైకేన రాఘవః. 69

తత స్సుగ్రీవవచనా ద్ధత్వా వాలిన మాహవే
సుగ్రీవమేవ తద్రాజ్యే రాఘవః ప్రత్యపాదయత్. 70

స చ సర్వాన్ సమానీయ వానరాన్ వానరర్షభః
దిశః ప్రస్థాపయామాస దిదృక్షుర్జనకాత్మజామ్. 71

## సుందరకాండః

తతో గృధ్రస్య వచనాత్సంపాతే ర్హనుమాన్బలీ
శతయోజనవిస్తీర్ణం పుప్లువే లవణార్ణవమ్. 72

తత్ర లంకాం సమాసాద్య పురీం రావణపాలితామ్
దదర్శ సీతాం ధ్యాయంతీ మశోకవనికాం గతామ్. 73

నివేదయిత్వాఽభిజ్ఞానం ప్రవృత్తించ నివేద్య చ
సమాశ్వాస్య చ వైదేహీం మర్దయామాస తోరణమ్. 74

పంచ సేనాగ్రగాన్ హత్వా సప్త మంత్రిసుతానపి
శూరమక్షం చ నిష్పిష్య గ్రహణం సముపాగమత్. 75

అస్త్రేణోన్ముక్తమాత్మానం జ్ఞాత్వా పైతామహాద్వరాత్
మర్షయన్ రాక్షసాన్వీరో యంత్రిణస్తాన్ యదృచ్ఛయా. 76

తతో దగ్ధ్వా పురీం లంకామృతే సీతాం చ మైథిలీమ్
రామాయ ప్రియమాఖ్యాతుం పునరాయాన్మహాకపిః. 77

సోఽభిగమ్య మహాత్మానం కృత్వా రామం ప్రదక్షిణమ్
న్యవేదయదమేయాత్మా దృష్టా సీతేతి తత్త్వతః. 78

## యుద్ధకాండః

తతస్సుగ్రీవసహితో గత్వా తీరం మహోదధేః
సముద్రం క్షోభయామాస శరైరాదిత్యసన్నిభైః. 79

దర్శయామాస చాత్మానం సముద్రస్సరితాం పతిః
సముద్రవచనాచ్చైవ నళం సేతుమకారయత్. 80

తేన గత్వా పురీం లంకాం హత్వా రావణమాహవే
రామస్సీతామనుప్రాప్య పరాం వ్రీడాముపాగమత్. 81

తామువాచ తతో రామః పరుషం జనసంసది
అమృష్యమాణా సా సీతా వివేశ జ్వలనం సతీ. 82

## మంగళ శ్లోకములు

ఆసాద్య నగరీం దివ్యా మభిషిక్తాయ సీతయా
రాజాధిరాజరాజాయ రామభద్రాయ మఙ్గళమ్.
మఙ్గళాశాసనపరై ర్మదాచార్యపురోగమైః
సర్వైశ్చ పూర్వై రాచార్యైః సత్కృతాయాస్తు మఙ్గళమ్.

కాయేన వాచా మనసేంద్రియైర్వా
బుద్ధ్యాఽత్మనా వా ప్రకృతే స్స్వభావాత్
కరోమి యద్య త్సకలం పరస్మై
నారాయణాయేతి సమర్పయామి.

యదక్షర పదభ్రష్టం మాత్రాహీనంచ యద్భవేత్
తత్సర్వం క్షమ్యతాం దేవ నారాయణ నమోస్తుతే.

హరిః ఓమ్ తత్ సత్.

# శ్రీరాముడు - సుగుణాభిరాముడు

"తపస్స్వాధ్యాయనిరతం తపస్వీ వాగ్విదాంవరం
నారదం పరిప్రపచ్ఛ వాల్మీకి ర్మునిపుంగవమ్" బాల. 1-1

"తపస్వియగు వాల్మీకి తపస్స్వాధ్యాయనిరతుడు, వాక్యవేత్తలలో శ్రేష్ఠుడు, మునిపుంగవుడు అయిన నారదుని ప్రశ్నించెను."

రామకథను వాల్మీకి అంతకుముందే ఎరుగును. అరణ్యములో శ్రీరాముడు వాల్మీకి ఆశ్రమమునకు వచ్చెను. రాముని కాలమున రాముని ఎఱుంగనివారు ఎవ్వరును లేరు.

"రామో రామో రామ ఇతి ప్రజానా మభవన్ కథాః"
యుద్ధ. 131-97

"ప్రజలందరును 'రాముడు రాముడు రాము'డని రాముని వార్తలనే చెప్పుకొను చుండెడివారు".

వాల్మీకికి బ్రహ్మవరమువలన రామకథనంతయు చూడగలిగిన శక్తి కల్గినది. అట్టిచో నారదుని అడిగి తెలిసికొను అవసరము లేదు. కాని వాల్మీకి అడిగెను. నారదుడు ఉపదేశించెను. దానిననుసరించి నే రామాయణరచన సాగెను. దీనిచే ఒక రహస్యము తెలియుచున్నది. వాల్మీకి ప్రశ్నించినది, నారదుడు ఉపదేశించినది కేవల రామకథ కాదు. అది బ్రహ్మవిద్య. సాక్షాత్ పరబ్రహ్మమే నరుడుగా రాముడను పేరుతో దిగివచ్చినది. అందుకే "బ్రహ్మ" అను రెండక్షరము లలోని అడుగుననున్న రెండక్షరములు "ర-మ" అనునవి రామనామ మైనవి. ఈనాడు నరుడుగా కనబడు రాముడే పరబ్రహ్మము. అతని నెఱుంగుటకు గురూపదేశము కావలెను. తపస్సు తెలిసినను గురువు వలన ఉపదేశము పొందిననాడే బ్రహ్మవిద్య ఫలించును.

"ఆచార్యాద్ధైవ విదితా విద్యా సాధిష్ఠం ప్రాపత్

ఆచార్యవాన్ పురుషో వేద"

ఆచార్యుడు బ్రహ్మవిద్యోపదేశమునకు అవశ్యక మని ఉపనిషత్తు తెలుపుచున్నది. అందుచే ఇచట వాల్మీకి రామకథను, బ్రహ్మవిద్యను కలిపి నారదమునివలన ఉపదేశము పొందవలెనని ప్రశ్నించుచున్నాడు. ఈప్రశ్న బ్రహ్మవిషయమని "పరిపప్రచ్ఛ" అన్నక్రియ తెలుపుచున్నది. ఆత్మజ్ఞానమునుగూర్చి శిష్యులు గురువుల నడిగెడి ప్రశ్నకు 'పరిప్రశ్నము' అనిపేరు. బాహ్యముగ నారదునిగూర్చి ప్రశ్నించుచు అంతరముగ బ్రహ్మమునుగూర్చి ప్రశ్నించినాడు.

ఈశ్లోకములో గురుశిష్యులకు ఉండవలసిన లక్షణములను వివరించుచున్నాడు. గురువు-నారదుడు, శిష్యుడు-వాల్మీకి:

(1) నరు డనగా జీవుడు. 'ర' = నశించునది. 'న' = కానిది 'నర' = ఆత్మ. నరునకు చెందినది నారము అనగా అజ్ఞానము. దానిని "ద" = ఖండించువాడు నారదుడు. అనగా జీవుని చేరియుండు అజ్ఞానమును ఛేదించువాడు = గురువు.

(2) నరు డనగా పరమాత్మ. విష్ణుసహస్రనామమున "నరః" అనునది భగవానునికి నామము

(3) నరు డనగా పరమపదమును పొందించువాడు. నరునకు సంబంధించినది నారము. అనగా జ్ఞానము. దానిని "ద" = ఇచ్చు వాడు నారదుడు. అనగా భగవత్ జ్ఞానము ప్రసాదించువాడు.

ఇట్లు అజ్ఞానమును ఛేదించి జ్ఞానము నిచ్చువాడు నారదుడు, అట్టి నారదుడే ఆచార్యుడు.

ఆచార్యునకు మూడు లక్షణములు ఉండవలయును.

## (1) తపస్స్వాధ్యాయనిరతుడగుట :-

తపస్సు = చాంద్రాయణము మున్నగు వ్రతములు. దానిచే శరీరేంద్రియ మనస్సులను కృశింపచేసి వేదాధ్యయనముచే ధర్మ బ్రహ్మస్వరూపములు నెరింగినవాడు కావలెను.

తపస్సు = భోగసంకోచము. భోగములను తగ్గించుకొని వేదాధ్యయనము చేయువాడు కావలెను.

తపస్సు = బ్రహ్మజిజ్ఞాస. వేదాధ్యయనము చేసి బ్రహ్మజిజ్ఞాస చేయువాడు కావలెను.

తపస్సు = యోగము. యోగమును, స్వాధ్యాయమును అలవర్చుకొనినవాడు కావలెను.

## (2) వాగ్విదాంవరుడగుట :-

శబ్దస్వరూపమును ఎఱింగినవారిలో శ్రేష్ఠుడు కావలెను. వేదాధ్యయనము చేసి దాని అర్థము నెఱింగి దానిని ఇతరులకు అందింపగలిగినవాడు కావలెను.

## (3) మునిపుంగవుడగుట :-

సంతతము భగవద్విషయమునే మననము చేయువాడు కావలెను.

ఇట్లు ఆచార్యునకు —

(2) తపస్స్వాధ్యాయనిరతి, (2) వాగ్విదాంవరత్వము, (3) మునిపుంగవత్వము ఉండవలెను.

ఈ మూడు లక్షణములచే —

(1) శ్రవణము (2) మననము (3) ధ్యానము అను మూడు లక్షణములు కూడ సూచింపబడవచ్చును. లేదా (1) పాండిత్యము (2) బాల్యము (3) మౌనము అను బ్రహ్మవేత్తకుండెడి మూడు లక్షణములు సూచింపబడవచ్చును.

ఇట్లు ఈ నారద అను పదము గురుత్వమును సూచించునదిగా ఎఱుంగవలెను.

నారదుడు (1) నారాయణపరాయణుడై, (2) త్రిలోకసంచారియై, (3) కలహశీలుడై ఉండునని మనకు ప్రసిద్ధి.

గురుపరముగా —

(1) నారాయణపరాయణుడే (2) ప్రకృతిబంధమునువీడి పైలోకములకేగి మరల భగవదాజ్ఞచే సంసారుల నుద్ధరించుటకు ఈలోకమునకు దిగివచ్చుటచే త్రిలోకసంచారియే (3) ధర్మాధర్మములకు, జ్ఞానాజ్ఞానములకు కలహమును కల్పించి ధర్మమునకు జ్ఞానమునకు విజయమును కలిగించుటచే కలహశీలుడే!

కావున నారదుని గురువుగా భావింపవలెను.

వాల్మీకి శిష్యుడు కదా! అతనికి ఉండవలసిన లక్షణము ఒక్కటియే! అది తపస్వి యగుట. తపస్సనగా ఆలోచన. బ్రహ్మవిషయిక మైన ఆలోచన కావలెను. తపస్వి యనగా దీనుడు. తాను పొందవలసిన జ్ఞానమును పొందలేదని దైన్యము పొందినవాడే శిష్యుడుగా నుండవలెను.

ఇట్లు ఈ శ్లోకములో శిష్యాచార్య సంబంధము నిరూపింపబడినది. దానిద్వారా అవతరించిన రామాయణకథ బ్రహ్మవిద్యయే యని నిరూపింపబడినది.

వాల్మీకి నారదుని ఒక మనిషినిగూర్చి ప్రశ్నించెను.

"కో న్వస్మిన్ సాంప్రతం లోకే గుణవాన్ కశ్చ వీర్యవాన్
ధర్మజ్ఞశ్చ కృతజ్ఞశ్చ సత్యవాక్యో దృఢవ్రతః" బాల. 1-2

"చారిత్రేణ చ కో యుక్తః సర్వభూతేషు కో హితః
విద్వాన్ కః కః సమర్థశ్చ కశ్చైకప్రియదర్శనః" బాల.1-3

" ఆత్మవాన్ కో జితక్రోధో ద్యుతిమాన్ కోఽనసూయకః
కస్య భిభ్యతి దేవాశ్చ జాతరోషస్య సంయుగే."  బాల. 1-4

"ఈ కాలములో ఈ దేశమున (1) గుణవంతుడు, (2) వీర్య వంతుడు, (3) ధర్మజ్ఞుడు, (4) కృతజ్ఞుడు, (5) సత్యవాక్యుడు, (6) దృఢ వ్రతుడు, (7) చారిత్రవంతుడు, (8) సర్వభూతహితుడు, (9) విద్వాం సుడు, (10) సమర్థుడు, (11) ప్రియదర్శనుడు, (12) ఆత్మవంతుడు, (13) జితక్రోధుడు, (14) ద్యుతిమంతుడు, (15) అనసూయుడు, (16) దేవతలకు కూడ భయముగొల్పు కోపముగల నరుడు ఎవడు? అట్టి వానిని ఎఱుంగవలెనని కోరిక కల్గియున్నాను. సమర్థుడవు కనుక ఇటు వంటి నరుని తెలియజేయ ప్రార్థించుచున్నాను" అని వాల్మీకి పదు నారు గుణములను పేర్కొని అట్టి గుణములుగల నరుడు ఈ కాలము లో ఈ దేశములో ఎవడు? అని ప్రశ్నించెను.

ఈ పదునారు గుణములు రామునకు పదునారు కళలు. వానితో కూడిన రాముడు-రామచంద్రుడు. అందుకే మనవారు రాముని రామ చంద్రుడని కీర్తించుచుందురు. ఇందు వాల్మీకి నరునిగూర్చి ప్రశ్నిం చెను. కాని, అందులో పరబ్రహ్మమునుగూర్చి కూడ ప్రశ్న యిమిడి యున్నది. పరబ్రహ్మమే అయా కాలములలో ఈ లోకమున అవత రించి సులభుడై మన విరోధులను తొలగించి తన్ను చేర్చుకొను చుండును. అట్టి పరబ్రహ్మమే, నేను రావణుడు నరునిచేత గాని చావడని నరుడుగా అవతరించెను. అందుచే బాహ్యముగ నరుడై అంతరముగ బ్రహ్మమైయుండు రామునిగూర్చి ప్రశ్నించు ప్రశ్నలో బాహ్యముగ నరుడుగా ఉండవలసిన లక్షణములు, అంతరముగ బ్రహ్మ లక్షణములను చేర్చియుంచెను. అందుచే ఈ పదునారు లక్షణములు కలదిదే పరబ్రహ్మము. అందుచే బాహ్యముగ ఈ ప్రశ్న రామకథా

విషయముగ, అంతరముగ—బ్రహ్మవిషయముగ నుండెనని ఎఱుంగ వలెను.

రావణుడు ఎవ్వరిచేతను చావు లేకుండ వరము కోరుకొని, నర వానరులను మాత్రము ఉపేక్షించెను. అందుచే వానిని సంహరించుటకు శ్రీరాముడు నరుడుగా నుండెను. రామాయణమునందంతటను రాముడు నరుడుగనే కనబడును. యజ్ఞభూమిలో దేవతలయెదుట సాక్షాత్కరించినప్పుడు —

"ఏతస్మిన్ అంతరే విష్ణు రుపయాతో మహాద్యుతిః,
శంఖచక్రగదాపాణిః పీతవాసా జగత్పతిః" బాల. 15-16

శ్రీరామజననమునకు ముందు విష్ణువే రాముడుగా అవతరింప నున్నాడని సూచించును. మరల యుద్ధానంతరము రావణవధ అయిన తరువాత దేవతలు రాముని స్తుతించుచు "నీవు నారాయణుడవే" అని పేర్కొనిరి. రామావతారము మొదలు రావణవధ యగునంతవరకు రాముడు నరుడుగనే కనబడును. దివ్యత్వము లోన అణగియుండును. అందుచే ఏ లక్షణములున్నచో నరుడు నరుడగునో ఆ లక్షణములను ఇందు ప్రశ్నించును. అంతరముగ బ్రహ్మమే యగుటచేతను, ఇతరు లందరు రాముని బ్రహ్మముగనే ఉపాసించుటచేతను, పరమాత్మలక్షణములను అంతరార్థమున ప్రశ్నించును. ఇట్లు ఈ ప్రశ్నలలో రాముని నరునిగను, బ్రహ్మముగను ఎఱుంగవలెనని సూచించుటకు ఈ ప్రశ్న సమాధానములు రెండర్థములతో సాగెను. రామాయణ మంతయును వాచ్యముగ రామకథను ప్రతిపాదించుచు, వ్యంగ్యముగ బ్రహ్మకథను నిరూపించునట్లే ఈ ప్రశ్నలుకూడ వాచ్యముగ నరుని గూర్చి వ్యంగ్యముగ బ్రహ్మమునుగూర్చి సాగును. దానిని వివరముగ తెలిసికొందము.

1. గుణవాన్ కః :-

తాత్పర్యము :

గుణవంతుడు ఎవడని ప్రశ్నించెను.

ఏ గుణమున్న నలుగురు నిను దరిచేర్చుకొందురో అట్టిదియే గుణము. ఏ గుణమున్న ప్రజలు ఎక్కువగా కోరుకొనుచుందురో ఆ గుణమే గుణమని చెప్పబడినది. అదియే సౌశీల్యము. ఆ సౌశీల్యము కలవాడు శ్రీరాముడు. ఇది మానవునకు ప్రధానముగా ఉండవలసిన గుణము. శ్రీరాముడు సుశీలుడు.

"మహతః మందైః సహ నీరంధ్రేణ సంశ్లేషః సౌశీల్యమ్" "జాతిచేతను, ఐశ్వర్యముచేతను, విద్యచేతను గొప్పవారగువారు, వారిలో తక్కువవారగువారితో అరమరిక లేక కలిసియుండుట సౌశీల్యము." ఇది శ్రీరామునిలో కాననగును.

శ్రీరాముడు జాతిచే సూర్యవంశమునకు చెందిన క్షత్రియుడు. ఐశ్వర్యముచే చక్రవర్తి కుమారుడు. విద్యచే వసిష్ఠాదుల శిష్యుడైన విద్యాధికుడు.

అట్టి శ్రీరామునకు అంతరంగమిత్రులు ముగ్గురు.

(1) పల్లెవాడు-గుహుడు.

(2) వానరుడు-సుగ్రీవుడు.

(3) రాక్షసుడు-విభీషణుడు.

వీరు ముగ్గురును జాతిచేకాని ఐశ్వర్యముచేకాని విద్యచేకాని రామునకు సమానులు కారు. కాని రాముడు వీరితో సమానముగ భావించి ప్రేమించెను.

(1) గుహుని "ఆత్మసమః సఖా" (అయో. 50–32) అనెను. తనకు దీటైన స్నేహితుడు గుహుడట. అతడు ఎదురుగా వచ్చినప్పుడు "పద్భ్యా మభిగమాచ్చైవ స్నేహసందర్శనేన చ" (అయో.50–40) నడచి వచ్చి ఇంత ప్రేమ చూపించితివే! ఆతిథ్య మిచ్చినట్లే! ఇంకేమి చేయవలెను!" అని శ్రీరాముడు ఎంతో సంతోషించును. గుహునితో ఇంతటి మైత్రికి గుహుని యోగ్యత కాదు. శ్రీరాముని సౌశీల్యమే కారణము.

(2) సుగ్రీవునితో కోరి మైత్రి చేసుకొనినాడు శ్రీరాముడు. సుగ్రీవుడు వానరుడు. భార్య, రాజ్యము కూడ పోయియున్నాడు. అతనితో మైత్రి చేసికొని అతని సుఖమే తన సుఖము—అతని దుఃఖమే తన దుఃఖము అనునట్లు ప్రవర్తించినాడు. సుగ్రీవునకు వాలిపై కోపము ఉండుటచే, తాను కూడ కోపము కల్గి అతనిని చంపెను. చనిపోయి పడియున్న వాలిని చూడగనే సుగ్రీవునకు కోపముతగ్గి ప్రేమ కలిగెను. ఏడ్చుచు రాజ్యము తనకు వద్దని విలపించెను. శ్రీరాముడు అట్టి సుగ్రీవునిచూచి "సంజాతబాష్పః పరవీరహంతా" (కిష్కిం.24–24) కన్నుల నీరునిండినవాడు అయెను. రామునిమైత్రి ఇట్టిది.

సుగ్రీవునికోపమే తనకోపము. సుగ్రీవుని ప్రేమయే తనప్రేమ. అంతే కాదు.

మరొక చిన్న విశేషమును చూడుడు. లంకలో వానరసైన్యముతో శ్రీరాముడు ప్రవేశించిన తరువాత పట్టణము వెలుపలనున్న కొండపై నెక్కి లంకను చూచుచుండెను. సుగ్రీవుడుకూడ ఆ ప్రక్కనే యుండెను. ఎదురుగా రావణుడు కన్పడెను. సుగ్రీవుడు చూచి ఆవేశము అపుకొనలేక ఎగిరి రావణునిపై పడి, రావణునికొట్టి, గీచి, కొరికి, తాను దెబ్బలుతిని నలిగి తిరిగి రామునివద్దకు వచ్చెను. అప్పుడు శ్రీరాముడు—

"త్వయి కించిత్ సమాపన్నే కిం కార్యం సీతయా మమ"

(యుద్ధ. 41-4)

"సుగ్రీవా! నీవేమైన అయియున్నచో నాకీ సీతతో ఏమి ప్రయోజనము?" అనును. తనకు ఇల్లాలై తనవెంట అడవికి వచ్చి తన కష్టసుఖములలో భాగస్వామిని అయిన సీతకంటె సుగ్రీవుడు ఎక్కువ అనినట్లు రాముడు భావించెను. ఇచట రాముడు పలికిన ఆమాటలలో సుగ్రీవునిపైగల వాత్సల్యమును చూడుడు. "సుగ్రీవా! నీవు చనిపోయియున్నచో నాకు సీతతో ఏమిపని?" అని నోటితో "చనిపోవుట" అన్న మాటకూడ అనలేక "నీవేమైన అయినచో" అనును. అశ్లీలమగుమాటకూడ సుగ్రీవుని విషయమున నోటితో రాముడు పలుకలేడు. ఇట్టిమైత్రి ఒక వానరునియందు కలిగియుండుట శ్రీరాముని సౌశీల్యము.

(8) తన శత్రువుయొక్క సోదరుడై శత్రుపక్షమునుండి వచ్చిన విభీషణుని రాక్షసుడని శంకింపక తనవారందరు వలదనుచున్నను 'మిత్రభావేన సంప్రాప్తం న త్యజేయం కథంచన' (యుద్ధ. 18–3) "మిత్రభావముతో వచ్చినవానిని వదలలేను" అని విభీషణునికి ఆశ్రయ మిచ్చిన పరమోదారుడు శ్రీరాముడు. ఇట్లు విభీషణుని చేరదీయుటకు రాముని సౌశీల్యమే కారణము. ఇట్లే శబరిని, జటాయువును ప్రేమించిన శ్రీరాముడు సుశీలుడు. దీనిచే రాముడు గుణవంతుడని తెలియుచున్నది.

అంతరార్థము:– పరమాత్మసౌశీల్యము–గుణవాన్ కః:–

గుణవంతు డెవడు? ఈ యర్థమునకు గుణమనగా సౌశీల్యమే అని గ్రహింపవలెను. గొప్పవాడు తక్కువవారితో చేరియుండుట సౌశీల్యము. పరమాత్మ సర్వజగత్తునకు కారణమైనవాడు, ప్రకృతి సంబంధము లేనివాడు. ఆ ప్రకృతిని నామరూపములుగల జగత్తుగ పరిణమింపచేసినవాడు. అట్టివాడై తనచే సృజింపబడిన ప్రతిపదార్థములో ఎంత నీచమైనను దానిలో తాను చేరియుండును "అనేన జీవేనాత్మనానుప్రవిశ్య నామరూపే వ్యాకరవాణి."

నామరూపములు కలదానినిగ ప్రకృతిని మార్చి అందు జీవులలో చేరియుండి ప్రవేశించును" అని ఉపనిషత్తున చెప్పబడుచున్నది. ఇదియే సౌశీల్యము. ఈ ప్రశ్నచే సర్వజగదంతర్యామి ఎవడు? అని ప్రశ్నించునట్లు అగును.

2. వీర్యవాన్ కః :-

బాహ్యార్థము :

వీర్యము కలవాడు ఎవడు?

మనమునకు దిగులు కల్గించు శత్రుసైన్యము ఎదురుగా నున్ననూ తానేమియు కలత పొందక దానిలో ప్రవేశించి దానిని పలుముఖములుగ విచ్చిన్నము చేయగల శక్తి వీర్యము. ఇట్టి వీర్యము కలవాడు రాముడే అని ఖర, దూషణాదివధలో మనకు స్పష్టమగును. రాముడు ఒక్కడును ఒక వైపు, పదునాలుగువేలమంది సైన్యము ఒక వైపు.

"నాఽఽదదానం శరాన్ ఘోరాన్ న ముంచంతం శిలీముఖాన్"
(అరణ్య. 25-36)

బాణములు సంధించుటగాని విడచుటగాని గుర్తించుటకు వీలు కాకుండ ఒక్కడు అంతటను అన్నిరూపములై యుద్ధము చేసెను. మారీచ సుబాహువధ, రావణవధ మున్నగు వానిలో రాముని వీర్యము స్పష్టమే! అందుచే వీర్యవంతుడు రాముడు.

అంతరార్థము :- పరమాత్మనుగూర్చి — వీర్యవాన్ కః ?

పరమాత్మకూడ వీర్యవంతుడే! జీవులకు జ్ఞానమును సంకోచింప చేసి వికారమును కలిగించునది ప్రకృతి. అట్టి ప్రకృతిలో పరమాత్మ కూడ జీవునితో పాటు ప్రవేశించియుండును. అట్లు ప్రవేశించియుండియు

తానేమియు వికారమును చెందక తనను వివిధముగ విచిత్రముగ వికారము నొందించువాడు కనుక పరమాత్మ వీర్యముకలవాడు. దీనిచే సర్వజీవులలో తాను ప్రవేశించి అంతర్యామియై యున్నను, వికారరహితుడై యుండువాడు ఎవడు? అని ప్రశ్నింపబడినది.

3. ధర్మజ్ఞః :-

బాహ్యార్థము :

ధర్మము నెఱింగినవాడు ఎవడు?

శ్రీరాముడు సర్వధర్మములను ఎరిగినవాడు. శిష్యుడుగా, పుత్రుడుగా, భర్తగా, ఆశ్రితరక్షకుడుగా, మిత్రుడుగా, శత్రువుగా అన్నివిధముల అన్నిధర్మములు ఎరిగి ఆచరించినవాడు. వైదికము లగు యజ్ఞములను ఆచరించినవాడు. యజ్ఞములో జన్మించి యజ్ఞమును కాపాడి యజ్ఞభూమిలో దొరికిన సీతమ్మను వివాహమాడి యజ్ఞవిరోధులగు రాక్షసులను సంహరించి ఋషులను కాపాడి వైదిక ధర్మమును లోకములో ప్రతిష్ఠించినవాడు.

"రక్షితా జీవలోకస్య ధర్మస్య పరిరక్షితా
రక్షితా స్వస్య ధర్మస్య స్వజనస్య చ రక్షితా"

(బాల. 1-13, 14)

తనధర్మమును తనవారిధర్మమును జీవులందఱియొక్క ధర్మమును కాపాడినవాడు శ్రీరాముడు.

అంతరార్థము :- పరమాత్మనుగూర్చి - ధర్మజ్ఞః :-

రక్షణమే పరమాత్మ ధర్మము.

పరమాత్మకూడ ధర్మజ్ఞుడే! జగత్తుయొక్క సృష్టిస్థితిలయములు రక్షణము. అవి ఎవని యధీనములో యున్నవో అది పరబ్రహ్మము.

"యతో వా ఇమాని భూతాని జాయంతే
యేన జాతాని జీవంతి యత్ప్రయంత్యభిసంవిశంతి
తద్విజిజ్ఞాసస్వ తద్బ్రహ్మేతి"

అని చెప్పబడిన సృష్టిస్థితిలయములు మహానుభావుడు ఠకుఁగాకే! అరయ గానే పరమాత్మయొక్క కృత్యము. దానిని ఎఱింగినవాడు, అనగా జగత్ప్రవృత్తమున అఖ్యాతిని సంకల్పముకలవాడు ఎవడు? అని పరమాత్మ గూర్చి ప్రశ్నించెను.

4. కృతజ్ఞః :-

బాహ్యార్థము :

ఒకరు చేసిన మేలు మరువని వాడెవడు?

చేసిన ఉపకారమును మరువక ఎల్లప్పుడును జ్ఞాపకము ఉంచు కొనువాడు కృతజ్ఞుడు. శ్రీరాముడు కృతజ్ఞతలో పరాకాష్ఠ నంది నట్లు ప్రజలు పరస్పరంతో రాముని గుణములను వర్ణించుచు చెప్పిరి.

"కథంచిదుపకారేణ కృతేనైకేన తుష్యతి
న స్మరత్యపకారాణాం శతమప్యాత్మవత్తయా" (అయో.1-11)

"శ్రీరాముడు ఎవరైన ఒక్క ఉపకారము ఎటులో కష్టపడి చేసిన ఆ ఉపకారముతో సంతోషించి ఆ ఉపకారమును ఎల్లప్పుడు గొని యాడుచు ఆనందించుచుండెడివాడు. ఒకరుచేసిన ఉపకారమును స్మరించుటయే కాదు. వంద అపకారములను చేసినను, వాటిని తలంపడు." జ్ఞాపకముండి తలంపకపోవుట కాదు. మరచిపోవును.

అంతరార్థము :- పరమాత్మను గూర్చి - కృతజ్ఞః :-

పరమాత్మయు కృతజ్ఞుడే!

"కృతజ్ఞ నానాతీతి కృతజ్ఞః" చేసిన దానిని ఎఱుంగువాడు. కృత మనగా జీవులు చేసెడి కర్మ. ఆ కర్మ నెఱింగి దాని కనుగుణమగు ఫలమును జీవులకు కల్పించుచుండును. తాను చేసిన కర్మను తాను మరచినను, పరమాత్మ మరువడు. జీవు లందఱి యొక్క అన్నివిధ ముల కర్మల నెఱింగి, ఆ కర్మానుగుణములగు శరీరముల నొసంగి, ఆ శరీరములో జీవులతో పాటు తానుకూడ ప్రవేశించి, నియమిం చుచు రక్షించును. ఈ పరమాత్మ లక్షణములనే "గుణవాన్, వీర్య వాన్, ధర్మజ్ఞః, కృతజ్ఞః" అను నాలుగు ప్రశ్నలలో సూచించెను.

5. సత్యవాక్యః :-

వాచ్యార్థము :

సత్యమయిన వాక్యము కలవాడు.

ఆడినమాట ఎన్నడును సత్యమేకాని అసత్యమాడి ఎఱుగడు. కైకేయి తండ్రిగారి కోరికగా పట్టాభిషేకమును మాని అరణ్యముల కేగవలెనని చెప్పెను. దానిని విని, రాముడు అట్లేయని అంగీకరిం చెను. అంగీకరించి "అమ్మా! తండ్రిగారు స్వయముగ నాతో ఈ మాట ఎందులకు చెప్పలేదు?" అని శ్రీరాముడు ప్రశ్నించెను. అప్పుడు కైక విశేషమును స్వయముగ చెప్పలేదని, రాముడు మాట తప్పునేమోయని శంకించెను. అప్పుడు శ్రీరాముడు –

"రామో ద్విర్నాభిభాషతే" (అయో. 18-30)

"రాముడు రెండుమాటలు మాటాడడు" అనెను.

"విద్ధి మాం ఋషిభిః తుల్యం కేవలం ధర్మమాస్థితం"
(అయో. 19-20)

"కేవలధర్మములే ఆచరించెడి ఋషులతో సమానునిగా నన్నెఱుం గుము" అనిచెప్పి ఆడినమాటకు కట్టుబడి నిలచెను. తల్లి కౌసల్య

వలదని వారించినను, లక్ష్మణుడు ప్రార్థించినను, సత్యమును విడలేక వనగమనమునకే నిశ్చయించెను. అరణ్యమునకేగి భరతుడు రాజ్యమును స్వీకరింపుమని ప్రార్థించెను. ప్రజలు, మంత్రులు, తల్లులు కూడ భరతుని కోరికకు తమ సమ్మతిని తెలియపర్చిరి. జాబాలి నాస్తికవాదముతో రాముని మరలింపచూచెను. వశిష్ఠుడు గురువుగా ఆదేశింపజూచెను. కాని శ్రీరాముడు మాత్రము తానాడినమాటకు కట్టుబడి వనవాసమునకే నిశ్చయించియుండెను. ఇది రాముని సత్యవాక్యమునకు పరమోదాహరణము.

అంతరార్థము :- పరమాత్మమూర్తి - సత్యవాక్యః.

పరమాత్మకూడ సత్యవాక్యుడే !

సత్యమను శబ్దమే పరమాత్మను తెలియజేయునది. "సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ" అని ఉపనిషత్తు చెప్పుచున్నది. సత్యమను పది పరమాత్మయొక్క స్వరూపమును తెలియజేయునది. ఛాందోగ్యోపనిషత్తునందు "సత్యమ్" అని పరమాత్మకు పేరగుటకు కారణమును ఇట్లు వివరించిరి. "సత్ + తి + యమ్ = సత్యమ్." 'సత్' అనగా ఆత్మ. ఎల్లప్పుడును మారక ఉండునది. 'తి' అనగా మారునది — ప్రకృతి. ఈ రెంటిని కలిపి నియమించువాడు 'యమ్'. 'సత్యమ్' అనగా జీవుని, ప్రకృతిని కలిపి నియమించువాడు. అతడే పరమాత్మ. అందుచే 'సత్యమ్' అనునది వాచకముగా కలవాడు. సత్యవాక్యుడు— పరమాత్మ.

6. దృఢవ్రతః :-

బాహ్యార్థము :-

తాను పట్టిన వ్రతమును దృఢముగ పాలించువాడు.

"నీవాడనని అనినవానికి అభయ మిచ్చుట నా వ్రతము" అని రాముడు విభీషణ శరణాగతిలో చెప్పెను.

"సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే
అభయం సర్వభూతేభ్యో దదా మ్యేతద్ వ్రతం మమ."
(యుద్ధ. 18-33)

"ఒక్కసారి ఇతరోపాయములను విడచి నీవాడనని యాచించిన వారు ఎవ్వరైనను సరే— అభయ మొసంగుట నా వ్రతము" అని శరణాగతులకు అభయ మొసంగుట తన వ్రతముగా పేర్కొనెను. వ్రతము చెడినచో ఎట్లు ఆ వ్రతముపట్టినవారికి పాపమో అట్లే శరణాగతునికి అభయ మొసంగనిచో తనకే పాపమని రాముని భావన. అందుచే తనవారు తనను విడిచిపోయినను, తనవారందరు నశించినను, తన కనేకములగు అనర్థములు వచ్చినను, తన ప్రాణమే పోయినను, శరణాగతులను వదలని దార్ఢ్యము కలవాడు రాముడు. అందుచే సుగ్రీవజాంబవదాదులు ఎందరు వలదనినను విభీషణుని తనవానినిగ చేసికొనెను. అట్లే దండకారణ్యమున ఋషులందరు యజ్ఞవిఘ్నకరులగు రాక్షసులను చంపి తమను కాపాడవలసినదని ప్రార్థింపగ అట్లే యని మాట నిచ్చెను. సీతమ్మ రాక్షసులతో మన కేమి విరోధము? విరోధము లేనిదే పగబట్టి హింసించుట తగదు— అని నివారింపచూచెను. అపుడు రాముడు—

"అప్యహం జీవితం జహ్యాం త్వాం వా సీతే! సలక్ష్మణాం
న తు ప్రతిజ్ఞాం సంశ్రుత్య బ్రాహ్మణేభ్యో విశేషతః"
(అర. 10-19)

"ప్రాణమునైనను వదలెదను లేదా అవశ్యకమైనచో లక్ష్మణునితో కూడ నిన్నైనను వదలెదను. కాని మాటనిచ్చి అందులో ముఖ్యముగ బ్రాహ్మణులకు చేసినదాని తిరుగలేను" అని పల్కెను. తన్నాశ్రయించినవారిని రక్షించుటలో రాముని వ్రతము ఇట్టిది.

అంతరార్థము :- పరమాత్మనుగూర్చి - దృఢవ్రతః.

పరమాత్మకూడ దృఢవ్రతుడే!

తన్నాశ్రయించినవారికి సంసారబంధమును ఛేదించి స్వస్వరూపమును కలిగించి అభయమును అనగా మోక్షమును ప్రసాదించుటలో పరమాత్మ దృఢవ్రతము కలవాడు. ప్రళయకాలమున అచేతన పదార్థములతో సమానముగా ఉన్న జీవునికి ఇంద్రియములతో, మనస్సుతో, బుద్ధితో కూడిన శరీరము నిచ్చి, ఆ శరీరమును ఎట్లు వినియోగించుకొని పరమాత్మను చేరవలెనో తెలుపుటకు వేదములను శాస్త్రములను ప్రసాదించి, వానిని వినియోగించుకొనలేక చెడిపోవువారిని ఉద్ధరించుటకు తానే నానారూపములతో అవతరించి, మహాపురుషుల నవతరింపచేసి, ఎంతో పట్టుదలతో తరింపచేయ ప్రయత్నించును. కావున జీవులను తరింపజేయుటకు పరమాత్మ దృఢవ్రతుడు.

7. చారిత్రేణ చ కో యుక్తః ?

బాహ్యార్థము :-

మంచి నడువడి కలవాడు ఎవడు ?

జ్ఞానముకంటె నడువడి ఆవశ్యకము. నడువడిచేతనే పురుషుని యొక్క స్వభావము తెలియును. నడువడిలేనివానిని చూచి లోకము భయపడును. అంత ఆవశ్యకము కనుకనే శ్రీరాముడు నడువడిని నియమతో ఆచరించెను.

చిత్రకూటమునకు భరతునితో కలిసి వెళ్ళిన జాబాలి నాస్తికవాదమును ఉపన్యసించును. తండ్రిమాటను పాలించుటకై అడవిలో నుండుట తగదని చెప్పెను తండ్రి ఎవరు ? తల్లి ఎవరు ? ఇచట

మానవుడు చేసిన పనులచేతను, పెట్టిన శ్రాద్ధములచేతను తల్లిదండ్రులకు సంతుష్టి కలుగుట కేవలకల్పన. అందుచే నీవు రాజ్యమును హాయిగా పాలించుమని చెప్పెను. దానిని విని శ్రీరాముడు చారిత్రముయొక్క ఆవశ్యకతను వివరించెను.

"కులీన మకులీనం వా శుచిం వా యది వా శుచిం
చారిత్ర మేవ వ్యాఖ్యాతి వీరం పురుషమానినం"

(అయో. 109-4)

"ఉత్తమకులములో జన్మించుట, లేదా హీనకులములో జన్మించుట, పవిత్రుడగుట, లేదా అపవిత్రుడగుట, వీరుడుగా నుండుట, లేదా డాంబికముగ వీరుడనని పలుకుట అనువానిలో ఏది ఎవనియందు ఉన్నదో తెలిసికొనవలెనన్న వాని చారిత్రమే వ్యాఖ్యానమై తెలియ చేయును."

మనుష్యుని స్వభావమునకు చారిత్రము వ్యాఖ్యానము. కఠిన మైనంత శ్లోకముయొక్క అర్థమును వ్యాఖ్యానముద్వారా గ్రహింపవీల గును. అట్లే ఒకడు యోగ్యమైన కులమునకు చెందినవాడో? కాడో? అని తెలిసికొనవలెనన్న యోగ్యతాపాత్రతలు కావు-నిర్ణయించునవి. వాని నడవడియే నిర్ణయించునది. ఇట్లే శౌచము అనగా పవిత్రత-ధనము విషయములో లోభపడకుండ నిలచుట అన్ని శౌచములకంటె గొప్పశౌచము. "యోऽర్థే శుచి స్స హి శుచిః" ధనమునందు ఎవడు పరిశుద్ధుడో వాడు పరిశుద్ధుడు అని మనుస్మృతి. ఇట్టి పరిశుద్ధి తన కున్నదని తాను చెప్పికొనినను ఇతరులు చెప్పినను నమ్మదగినది కాదు. దానిని నడవడిచేతనే నిరూపించవలెను. ఇట్లే వీరుడా? వీరుడని ప్రగల్భము కొట్టుకొనువాడా? అనునది తెలియుటకుకూడ వానినడ వడియే ముఖ్యము. అందుచే "నేను రాజ్యమునందు లోభములేనివాడను సత్య వాక్యమునకు నిలబడువాడను" అని తెలుపుటకు "చారిత్రమును

విడువరాదు" అని శ్రీరాముడు చారిత్రముయొక్క ప్రాముఖ్యమును వివరించెను. తాను నడువడిని తప్పక పాటించెను.

అంతరార్థము :- పరమాత్మనుగూర్చి - చారిత్రేణ చ కో యుక్తః?
పరమాత్మ కూడ చారిత్రము కలవాడే!

చారిత్రమనగా నడువడి. సృష్టికిముందు కదలిక లేక, ఉన్నదా? లేదా? అన్నట్లున్న పరమాత్మ స్థూలముగ జగద్రూపమున సాగుటయే నడువడి. సృష్టికిముందును, సృష్టికితరువాతను ఒకే తత్త్వముండును. సృష్టికిముందు కదలికలేని జీవప్రకృతులతో చేరియుండును. అదే తత్త్వముసృష్టికితరువాతమార్పుచెందిన జీవప్రకృతులకదలికచే కదలినట్లు ఉండును. ఇదే పరమాత్మయొక్క చారిత్రము. సృష్టికిముందు సూక్ష్మరూపమున ఉన్న చేతనాచేతనములు అను తన శరీరమును కదలించి జగద్రూపమున స్థూలముగా కదలినవాడు ఎవడు? అని పరమాత్మను గూర్చి ప్రశ్నించెను.

8. సర్వభూతేషు కో హితః :-

బాహ్యార్థము :-

సర్వభూతముల మేలును కోరువాడును, ఆచరించువాడును ఎవడు ?

శ్రీరాముడే అట్టివ్యక్తి. బంధువులకును అన్యులకును మేలుకలుగవలెనని, అందరుకోరుదురు కాని, మనుష్యులందరియొక్క మేలును కోరి, వారికి మేలుకలుగునట్లుమాటాడి, వారికి ఆపదలుకలుగునప్పుడు దుఃఖపడినవాడు, శ్రీరాముడు ఒక్కడే! అయోధ్యాప్రజలు రామునియొక్క గుణములను కీర్తించుచు ఇట్లు చెప్పెదరు.

"వ్యసనేషు మనుష్యాణాం భృశం భవతి దుఃఖితః
ఉత్సవేషు చ సర్వేషు పితేవ పరితుష్యతి." (అయో.2-40)

"పట్టణములో మనుష్యుల కెవరికైనను ఆపదలు కలిగినచో ఆపదలు కలిగినవారికంటెను ఎక్కువగా రాముడు దుఃఖించెను. వారికి ఏవైన ఆనందజనకములగు సంపదలు లభించిన, తండ్రివలె సంతోషించును."

ఈశ్లోకములో రాముని సర్వభూతహితత్వము సూచింపబడినది. మీరు వారు అను భేదము లేక మనుష్యులలో ఎవరికి ఎట్టి ఆపదకలిగినను పెద్దది, చిన్నది అను తారతమ్యము లేకుండ వారికన్న ఎక్కువగా రాముడు దుఃఖించునట. ఆపదకలిగినవారు ఆపద తీరగనే దుఃఖమును విస్మరింతురు. కాని రాముడు మాత్రము దుఃఖించుచునే యుండునట. దీనికి కారణము, వారికి మేలును కలిగించుట తన బాధ్యత యని భావించుటయే! కాపాడవలసిన తల్లి ప్రక్కనుండగా ఏమియు తెలియని పసిపాప ప్రాకుచుపోయి నూతిలోపడినది. తల్లి దానితోపాటు ఉరికి పిల్లను పైలకుతీసినది. పిల్లకు ఆపదతీరినది, నవ్వుచున్నది, కాని తల్లిమాత్రము దుఃఖించుచునే యున్నది. కారణము బాధ్యతగల తాను పరాకుగా నుండి బిడ్డ నూతిలోపడునట్లు చేసితినే యని ఆమె ఆ దుఃఖమును మరువలేదు. అట్లే రాముడు కూడ అందరకు మేలు కలిగింపవలసిన తాను పరాకుగా నుండుటచేతనే గదా! వారికి ఆపద కలిగినదని దుఃఖించును. ఇతడు మనుష్యులయొక్క హితమునే కోరువాడు కాడు. సర్వభూతములయొక్క హితమును కోరువాడు. అందుచేతనే రావణునిచే దెబ్బతిని రెక్కలువిరిగి నేలపై కూలి ప్రాణము పోవుటకు సిద్ధముగానున్న జటాయువును చూచి -

"రాజ్యాద్భ్రంశః వనే వాసః సీతా నష్టా హతో ద్విజః
ఈదృశీయం మమాలక్ష్మీః నిర్దహే దపి పావకమ్"

(అర. 68-24)

"రాజ్యము పోయినది. వనవాసము లభించినది. సీత కనబడకుండ పోయినది. ఈ పక్షి చనిపోయినది. ఇదంతయు నా దురదృష్టము. ఇది అగ్నిహోత్రమునుకూడ కాల్చివేయగలదు" అని ఆ పక్షి చని పోవుటకు కూడ తన దురదృష్టమే కారణమని శోకించెను. చనిపోయిన తరువాత ఆ పక్షికి స్వయముగ తానే దహనసంస్కారము చేయును. ఇట్లు రాముడు సర్వభూతహితుడు.

అంతరార్థము :- పరమాత్మనుగూర్చి - సర్వభూతేషు కో హితః ?

పరమాత్మకూడ సర్వభూతహితుడే!

హితుడనగా ఉపాయమైనవాడు. పరమాత్మను పొందుటకు పరమాత్మయే ఉపాయమని కఠోపనిషత్తును, ముండకోపనిషత్తును ప్రతిపాదించుచున్నవి.

"నాయమాత్మా ప్రవచనేన లభ్యో న మేధయా న బహునా శ్రుతేన యమేవైష వృణుతే తేన లభ్యః తస్యైష ఆత్మా వివృణుతే తనూం స్వామ్"

"పరమాత్మ శ్రవణము చేగాని, మననము చేగాని, ధ్యానము చేగాని లభింపడు. పరమాత్మ ఎవరిని వరించునో వారికే తనస్వరూపమును దర్శింపచేయును. మనము చేయు కర్మగాని, జ్ఞానముగాని, భక్తిగాని భగవత్ప్రాప్తికి సాధనములు కావు. భగవానుడే సాధనము.

"సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ"

(గీత. 18-66)

అని శ్రీకృష్ణభగవానుడు చెప్పెను. కావున సర్వభూతములకు హితుడు పరమాత్మయే!

9. విద్వాన్ :-

బాహ్యార్థము :-

విద్వాంసుడు ఎవడు ?

విద్వాంసుడు శ్రీరాముడు. సర్వశాస్త్రముల యొక్క తత్త్వము నెఱింగినవాడు. వేదవేదాంగములయందు పరినిష్ఠితుడు. ధనుర్వేద

మందు సుపరిచితుడు. మంత్రమునందు, రహస్యసమాచార సేకరణ మునందు, నీతిశాస్త్రమునందు, వ్యావహారవచనములయందు బాగుగ చెప్ప గలవాడు. గజస్కంధమునందు, అశ్వపృష్ఠమునందు ఆరితేరినవాడు. ఇట్లు సర్వవిద్యలయందు పాండిత్యము గలవాడు శ్రీరాముడు.

అంతరార్థము :- పరమాత్మయందు - విద్వాన్.

పరమాత్మయే విద్వాంసుడే!

"యః సర్వజ్ఞః సర్వవిత్" అని ఉపనిషత్తు పరమాత్మ సర్వ మును సమష్టిగను, వ్యష్టిగను కూడ ఎఱిగినవాడని చెప్పుచున్నది. ఆ జ్ఞానము సంపాదించునట్టిది కాదు, సహజము అని "స్వాభావికీ జ్ఞాన, బలక్రియాచ" అని ఉపనిషత్తు చెప్పుచున్నది. ఆ జ్ఞానము కూడ ఇంద్రియసాధ్యము కాదు. "పశ్యత్యచక్షుః స శృణోత్యకర్ణః" "కన్ను లేకుండ చూచును. చెవి లేకుండ వినును" అని ఉపనిషత్తు చెప్పు చున్నది. సర్వజగత్ సృష్టికి ఆవశ్యకమగు జ్ఞానముగలవాడు పరమాత్మ!

10. సమర్థః :-

బాహ్యార్థము :-

సామర్థ్యము గలవాడు ఎవడు!

కేవలము శాస్త్రజ్ఞానము ఉన్నంత మాత్రమున ప్రయోజనము లేదు. కార్యరూపమున ఆచరించుటలో సామర్థ్యము ఉండవలెను. శ్రీరాముడు, వివిధ విషయములను గురువులతో చర్చించుటలో సమర్థుడు. శీలవృద్ధులు, జ్ఞానవృద్ధులు, వయోవృద్ధులు కూడ శాస్త్ర విషయములను శ్రీరామునితో చర్చించుచుండెడివారు. రాజ్య నిర్వాహణమున రాజనీతిశాస్త్ర పరిజ్ఞానమును వినియోగించగల సమర్థుడు. అస్త్రవిద్య యుద్ధభూమియందు వినియోగించగల సమర్థుడు. అందుచే శ్రీరాముడు సమర్థుడు.

అంతరార్థము :- పరమాత్మను గూర్చి :- సమర్థః :-

పరమాత్మ కూడ సమర్థుడే !

సర్వజ్ఞుడై సర్వజగత్తును సృష్టించుటకు సామర్థ్యము ఆవశ్యకము. అదే శక్తి. "పరాస్య శక్తి ర్వివిధైవ శ్రూయతే స్వాభావికీ జ్ఞాన బలక్రియా చ" అని సర్వజగన్నిర్మాణమును సంకల్పమాత్రముచే చేయగల సమర్థుడు. సృష్టించిన ప్రపంచపదార్థములలోను పరమ మహాత్మ్యప్రమాణుడగు తాను అణువగు జీవునియందు అణువై వ్యాపించును. కర్మల నెరింగి కర్మానుగుణముగ శరీరమును ప్రసాదించి కర్మానుగుణముగ ఫలము నీయ సమర్థుడు.

11. ఏకప్రియదర్శనః :-

బాహ్యార్థము :-

ఎల్లప్పుడు ఒకేవిధముగ ప్రియమైన దర్శనము కలవాడు ఎవడు?

ప్రియమైన దర్శనము కలవాడు రాముడొక్కడే! ఇతరులను చూచినప్పుడు చూచిన వారికి ఒకప్పుడు ప్రీతి, ఒకప్పుడు అప్రీతి కలుగుచుండును. కాని, రాముడట్లుకాడు. చూచిన వారికి ప్రీతియే కలుగును. శత్రువులకైనను, మిత్రులకైనను, స్త్రీలకైనను, పురుషులకైనను, జ్ఞానులకైనను, అజ్ఞానులకైనను, శ్రీరాముని దర్శనము ప్రీతినే కలిగించుచుండును. రాముని చూచి, అడవిలో నున్న క్రూరమృగములు కూడ ప్రీతిని పొంది తమ దుష్టతను వీడి యుండెడివి. రాముని దర్శనముచే ప్రీతిని, దర్శనము లేకపోవుటచే అప్రీతిని, వృక్షములు, నదులు కూడ పొందినవి. రాముని చూచి, ప్రేమించి తిరస్కరింపబడి, లక్ష్మణునిచే ముక్కు, చెవి కోయబడి ఖరునివద్దకు వెళ్ళిన శూర్పణఖ —

"తరుణౌ రూపసంపన్నౌ సుకుమారౌ మహాబలౌ
పుండరీక విశాలాక్షౌ చీరకృష్ణాజినాంబరౌ" (అర.19-4)

అని వారిరూపమును ప్రశంసించెను. వాలిని చంపిన రాముని నిందింప వలెనని వచ్చినతార "సా తం సమాసాద్య విశుద్ధసత్త్వా" (కిష్కి.24-30) ఆ రాముని చూడగనే సత్త్వగుణము ఆవిర్భవించినదియై రాముని దర్శనమున ప్రీతిగొంది-

"త్వ మప్రమేయశ్చ దురాసదశ్చ జితేంద్రియశ్చోత్తమధార్మికశ్చ
అక్షయ్యకీర్తిశ్చ విచక్షణశ్చ క్షితిక్షమావాన్ క్షతజోపమాక్షః"
(కిష్కి.24-31)

అని స్తోత్రము చేసెనే కాని దూషింప లేకపోయెను. రావణుడు కూడ తన పరాక్రమముచే శ్రీరాముని రంజింపచేయుటయే గొప్ప యని భావించును కాని, అన్యథా భావింపలేడు. ఇంత ప్రేమగల దశరథాదులు రామునిగాంచి ప్రీతినొందుటలో ఆశ్చర్య మేమున్నది? మన్మథ మన్మథుడు—పురుషులకు కూడ మోహము కల్గించువాడు. చంద్రుని వలె ప్రియదర్శనుడు—అగు రాముడు ఎల్ల వేళల, ఎల్లరకు ప్రియమైన దర్శనముకలవాడు.

అంతరార్థము :- పరమాత్మగూర్చి :- ప్రియదర్శనః :-
పరమాత్మకూడ ప్రియదర్శనుడే!

ఎల్ల వేళల అందరకు ఆనందమును కల్గించు దర్శనముకలవాడు పరమాత్మయే! ఈ లోకములో అన్ని వస్తువులును సత్త్వము, రజస్సు, తమస్సు అనుమూడుగుణములుకల ప్రకృతిచే నిర్మింపబడినవి. అందు సత్త్వము సుఖమును కలిగించునది. రజస్సు దుఃఖమును కలిగించునది. తమస్సు శోకమును కలిగించునది. అందుచే లోకములో ఏవస్తువైనను

ఒకప్పుడు సుఖమును కలిగించునది, వేరొకప్పుడు దుఃఖమును కల్గించు చుండును. పరమాత్మ మాత్రము శుద్ధసత్త్వమయుడై ఆనందస్వరూపుడై యుండును. అందుచే ఎల్లవేళల ఎల్లరకు పరమాత్మ దర్శనము ఆనందమునే కల్గించును గనుకచే ప్రియుడై యుండును. అందుచే పరమాత్మ సర్వప్రియదర్శనుడు.

12. ఆత్మవాన్ :-

బాహ్యార్థము :-

ప్రశస్తమైన మనస్సు కలవాడు ఎవడు? ధైర్యము కలవాడు ఎవడు?

ఆత్మయను పదమునకు మనస్సు, ధైర్యము అనియును అర్థము కలదు. ప్రశస్తమైన మనస్సు కలవా డగుటచేతనే ఎవరు ఎంత అపకారము చేసినను క్షమించగలిగినవాడు శ్రీరాముడు. పట్టాభిషేకము సిద్ధమయినది. దశరథుని యాజ్ఞచే, వసిష్ఠుడు సీతారాములకు దీక్ష నొసంగెను. పట్టాభిషేకసామగ్రి సిద్ధమైనది. కైక సుమంత్రునిచే పిలిపించినది. పట్టాభిషేకము లేదు. అడవులకు పొమ్మని చెప్పినది. వెళ్ళునప్పుడు కొద్దిసేపటిలో పట్టాభిషేకము జరుగునని భావించుచు రాముడు వెళ్ళెను. వచ్చునప్పుడు తాను రాజు కాడు అని తెలిసినది. కాని, వచ్చునప్పుడు రాముని ముఖములో మార్పు లేదు. ఇది ఆతని మనస్స్థితి. అంతేకాదు. తాను ద్వేషించి దూషించవలసిన కైకను తాను దూషించక పోవుటయే కాక, లక్ష్మణుడు, భరతుడు మొదలగువారు ఎవరు దూషించినను వలదని వారించిన క్షమాశాలి శ్రీరాముడు.

అంతరార్థము :- పరమాత్మనుగూర్చి :- ఆత్మవాన్ :-

పరమాత్ముడు ఆత్మవంతుడే!

ఆత్మలు తనవిగా కలవాడు. జీవులందరు, పరమాత్మకే చెందిన వారు. అనగా శేషభూతులు. పరమాత్మయందే ఆధారపడియుండి వానియొక్క అంశమునకు వినియోగపడ తగినవారు. ఆత్మకు శరీరము ఎట్లు శేషభూతమై యుండునో పరమాత్మకు ఈ ఆత్మలుకూడ అట్లు శేషభూతములే! శరీరము ఆత్మకు వినియోగించుటకు ఎట్లు ఉపయోగపడునో అట్లే ఆత్మలు పరమాత్మకు యథేష్టముగ వినియోగించుకొన దగినవై యుండును.

## 13. జితక్రోధః :-

వ్యాఖ్యారము :

క్రోధమును జయించినవాడు ఎవడు ?

మానవత్వమునకు ఇది ముఖ్యలక్షణము. క్రోధము కలుగుటకు తగిన సన్నివేశము ఉన్నను, క్రోధము రాకుండ జయించినవాడే మానవుడు. శ్రీరాముడు క్రోధము లేనివాడు కాడు. క్రోధమును జయించినవాడు. అందుచేతనే రామునకు క్రోధము వచ్చినప్పుడు, రామాయణమున "క్రోధ మాహారయత్" 'క్రోధము తెచ్చుకొనెను' అనును కాని క్రోధము వచ్చెను అనదు. క్రోధము తెచ్చుకొనవలెను. క్రోధము తనవశమునందు ఉండవలెను. కాని క్రోధమునకు తాను వశుడు కాకూడదు. అందుచేతనే శ్రీరామునకు కోపము రాదగిన సన్నివేశము కూడ ఒడలు తెలియని కోపమును తెప్పించలేదు. సుగ్రీవునిపై కోపము వచ్చినప్పుడుకూడ ఔచిత్యము చెడకుండ కబురంపును. కాని ఆవేశముతో మాటాడలేదు.

"న చ సంకుచితః పంథాః యేన వాలీ హతో గతః" (కిష్కి...30–81)

"వాలి వెళ్ళిన దారి యింకను మూతపడలేదు" అని చెప్పుమనెను. పట్టరానికోపము వచ్చునప్పుడుకూడ కోపము తనవశములో నుండు

టచే పలుకులో మార్దవము తగ్గదు. ఇట్లు రామాయణ మంతయు రాముడు జితక్రోధుడుగనే కనబడును. కాని రావణునితో యుద్ధము చేయుచున్నప్పుడు రామునికి వాహనముగానున్న ఆంజనేయునికి దెబ్బలు బాగా తగిలి రక్తము కారుచుండెను. అప్పుడు-

“రావణేనకృతవ్రణం దృష్ట్వా ప్లవగశార్దూలం కోపస్య వశమేయివాన్”

రావణునిచే గాయపరచబడిన హనుమంతునిచూచి రాముడు కోపమునకు వశ మాయెను. తనకెన్ని కష్టములు వచ్చినను కోపము రానివానికి, ఆంజనేయునికి దెబ్బలు తగులునప్పుడుమాత్రము అపుకొనలేని కోపము వచ్చెను.

అంతరార్థము :- పరమాత్మనుగూర్చి :- జితక్రోధః :-

పరమాత్మకూడ జితక్రోధుడే !

ఈ జీవులు పరమాత్మవలెననే సత్తనుపొంది తనస్థితికి, గతికి, ప్రవృత్తికికూడ కారణమయినవానిని ఎదిరించి దూషించును. అనంతములగు భగవ దపచారములను చేయుచుండును. అట్టివానిపై పరమాత్మ కోపము తెచ్చుకొనడు. వానిని అనుసరించి ఎటులైనను రక్షింపవలెనని చూచుచుండును. ధూర్తుడైన కుమారుడు తండ్రితో విరోధించి ఒకసత్రమున చేరి అచట అధికారిని ఆశ్రయించి జీవించు చుండును. తండ్రి కుమారుని వదలలేక ఆ కుమారునికి కనబడకుండ సత్రపు అధికారిని చేరి, వానికి డబ్బునిచ్చి కుమారునకు భోజనము పెట్టించుచుండును. కుమారుడు తండ్రి పెట్టించుచున్నాడని తెలియక అధికారికి విధేయుడై తండ్రిని ద్వేషించుచుండును. ద్వేషించుచుండినను, తండ్రి వదలలేడు. అట్లే భగవానుడుకూడ, కోపము తెచ్చుకొనక ఎన్ని అపరాధములు చేసినను మనను రక్షింప యత్నించు చుండును. అందుచే భగవానుడు జితక్రోధుడు.

## 14. ద్యుతిమాన్ :-

బాహ్యార్థము :-

కాంతి గలవాడు ఎవడు ?

శ్రీరాముని కాంతి చంద్రుని వెన్నెల వలె లోకములకు ఆహ్లాద జనకమైనది, సామాన్యము కాదు. దండకారణ్యములో ఋషులు

"రూపసంహననం లక్ష్మీం సౌకుమార్యం సువేషతాం
దదృశు ర్విస్మితాకారా రామస్య వనవాసినః" (అర. 1-13)

రామచంద్రుని దివ్యమంగళవిగ్రహమును, కాంతిని, సౌకుమార్యమును, మనోహరవేషమును, చూచి విస్మయముతో నిలచిన దృష్టితోనను తిలకించిరి అని మహర్షి వ్రాసిరి. రాముని లావణ్యమును, కాంతిని చూచి విశ్వామిత్రుడు, జనకుడు మున్నగువారు కూడ ముగ్ధులై మంగళమును పలికిరి. తొడపై పండుకొని నిద్రించుచున్న రాముని శోభను చూచి సీతమ్మ, "శ్రీమాన్ సుఖసుప్తః" అని మెల్ల-ఉల్లమున ఎంతో శ్లాఘనచేసెను. ఇట్లు శ్రీరాముడు దివ్య కాంతి విరాజితుడు.

అంతరార్థము :- పరమాత్మస్వరూపము :- ద్యుతిమాన్ :-

పరమాత్మస్వరూప ద్యుతిమంతుడే!

"పరంజ్యోతిః" అని పరమాత్మయొక్క స్వరూపమును ఉపనిషత్తు వర్ణించినది.

"తస్య భాసా సర్వ మిదం విభాతి"

ఆ పరమాత్మ వెలుగు స్థానమున సూర్యుడు, చంద్రుడు, నక్షత్రములు వెలుగులు మున్నగు నవియు ప్రకాశించును. ఈ లోకములో కాంతి

నొసంగునవి అన్నియు ఆ పరమాత్మయొక్క కాంతిచేతనే ప్రకాశించుచున్నవి. అందుచే పరమాత్మ ద్యుతిమంతుడు.

15. అనసూయకః :-

తాత్పర్యము :-

అసూయ లేనివాడు ఎవడు ?

గుణములను దోషములుగా ఎత్తిచూపుట అసూయ. ఆ అసూయ లేనివాడు రాముడు. గుణములను దోషములుగా చూడక పోవుటయే కాదు; దోషములనుకూడ గుణములుగ భావించువాడు శ్రీరాముడు. అడవికి వెళ్ళునట్లు చేసిన తండ్రియందు కాని, ప్రేరేపించిన కైకయందు కాని ఒక్క దోషముకూడ తలంపనివాడు శ్రీరాముడు.

అంతరార్థము :- పరమాత్మనుగూర్చి :- అనసూయకః :-

పరమాత్మకూడ అసూయ లేనివాడే !

మన దోషములలో గుణములను వెదకొని మనను రక్షించును. భగవానునికి విముఖుడై యున్న జీవుడు చేయుచున్న పనులలో సుకృతముగ పేర్కొనదగినవానిని తానే వెదకొని వానిని కాపాడును. చెడ్డపనులే తప్ప మంచిపనులు చేయుట అలవాటు లేని జీవుని రక్షించుట యెట్లని భగవానుడు అన్వేషించుచుండును.

మూడు రకములైన సుకృతములను పరమాత్మ చూచి రక్షించునట.

(1) ఆనుషంగిక సుకృతము
(2) ప్రాసంగిక సుకృతము
(3) యాదృచ్ఛిక సుకృతము

1. ఆనుషంగిక సుకృతము :-

అనుకోనకుండగ వచ్చిన పుణ్యము. దూడ తప్పిపోవగ వెతకుచు ఆలయమునకు వెళ్ళి, దానివెంట పరుగిడుచు మూడుసార్లు ప్రదక్షిణము చేయుట. ఇది వాడు పుణ్యముగా చేయడు. కాని పుణ్యమైన పని జరిగినది. దానిని భగవానుడు లెక్కలోనికి తీసికొనును.

2. ప్రాసంగిక సుకృతము :-

మాటలలో శ్రీరంగము, వేంకటాచలము మున్నగు పేర్లను అనుకోనకుండ వేరొకపనిమీద పలికినను పుణ్యస్థలముల కీర్తించిన సుకృతముక్రింద, భగవానుడు లెక్కపెట్టుకొనును. ఇది ప్రాసంగిక సుకృతము.

3. యాదృచ్ఛిక సుకృతము :-

తన వస్త్రములను తాను కాపాడుకొనుటకు కూర్చొనియుండగా భగవత్ భక్తులయొక్క వస్త్రములుకూడ కాపాడబడినచో అది యాదృచ్ఛిక సుకృతము.

ఇట్లు మూడు సుకృతములను చూచి పరమాత్మ రక్షించెడి ఉదారుడు. దోషములలో కూడ గుణములనే చూచెడి అనసూయుడు పరమాత్మ.

19. కస్య బిభ్యతి దేవాశ్చ జాతరోషస్య సంయుగే :-

తాత్పర్యము :-

యుద్ధములో కోపము వచ్చినచో దేవతలుకూడ ఎవనికి భయపడుదురో అతడెవడు ?

కనుక కోపమును జయించినవాడు ఎవడు? అని ప్రశ్నించెను. ఇప్పుడు కోపము వచ్చినచో దేవతలు కూడ భయమును గొల్పు కోపము గలవాడు ఎవడని ప్రశ్నించుచున్నాడు.

దీనిచే మానవుడు కోపము లేనివాడు కాకూడదు. తగనిచోట కోపము రాకూడదు. వచ్చినపుడు కోపము తనవశమందు ఉండవలెను. యుద్ధభూమిలో తనశత్రువునకుమాత్రి రాముడు కోపము తెచ్చుకొనునపుడు అతనికి కోపము లేదని తెలియు దేవతలు గూడ నిజముగ కోపము వచ్చినదేమోయని భయపడి దూరముగ తొలగుదురు. ఇది శ్రీరాముని కోపవిధానము.

అంతరార్థము :- పరమాత్మనుగూర్చి :- కస్య......సంయుగే :-

పరమాత్మయొక్క కోపమునకుకూడ దేవతలు భయపడి, తమ తమ పనులను చేయుచుందురని ఉపనిషత్తు చెప్పుచున్నది.

"భీషాస్మా ద్వాతః పవతే,
భీషోదేతి సూర్యః
భీషాస్మా దగ్ని శ్చేంద్ర శ్చ.
మృత్యు ర్ధావతి పంచమ ఇతి."

"వాయువు పరమాత్మ భయమువలననే వీచుచున్నది. పరమాత్మ భయమువలననే, సూర్యుడు ఉదయించుచున్నాడు. పరమాత్మ భయము వలననే ఇంద్రుడు, అగ్ని కూడ తమ తమ పనులను చేయుచున్నారు, చివరకు మృత్యువుకూడ ఆ పరమాత్మభయమువలనే పరుగిడుచున్నది." ఇట్లు పరమాత్మకోపమునకు దేవతలుకూడ భయపడుదురు.

ఈ విధముగా వాల్మీకి నారదుని ప్రశ్నించిన ఈ పదునారు గుణములలో బాహ్యముగ నరునిగూర్చి, అంతరముగ పరమాత్మనుగూర్చి ప్రశ్నించుట యున్నదని ఎరుంగవలెను. నారదుడు దానికి తగినట్లుగనే సమాధానమొసంగెను. అందుచే రామాయణ మంతయు బాహ్యముగ నరుడగు రామునిగూర్చి అంతరముగ బ్రహ్మమునుగూర్చియు ప్రవర్తించినదని చెప్పుటలో సంశయము అక్కరలేదు.

వాల్మీకియొక్క ప్రశ్నకు సమాధానముగ నారదుడు రామకథ నంతను ఉపదేశించెను. ఇదియే సంక్షేపరామాయణము. ఇది శ్రీరామాయణములోని మొదటిసర్గ. ఈసర్గను పారాయణము చేసినచో రామాయణము పూర్తిగ పారాయణ చేసిన ఫలితము సిద్ధించును.

రామాయణము గాయత్రీ మంత్రమును ప్రతిపాదించునని నిరూపించుటకు నారదుడు ఉపదేశించిన ఈ బాలరామాయణము గాయత్రీ మంత్రముయొక్క మొదటిఅక్షరముతో ప్రారంభమై చివరిఅక్షరముతో సమాప్తమగును. "తపస్స్వాధ్యాయనిరతం" అనుచోట 'త' కారము గాయత్రీమంత్రముయొక్క ఆద్యక్షరము. ఈ సర్గ చివరి శ్లోకము "జనశ్చ శూద్రోఽపి మహత్త్వ మీయాత్" దానిలోని 'యాత్' అను అక్షరముతో అంతమగును. ఇది గాయత్రీమంత్రముయొక్క చివరి అక్షరము. దీనిని చదువుటచే గాయత్రీమంత్రము చేసిన ఫలితము కలుగును.

వాల్మీకియొక్క ప్రశ్నకు సమాధానముగ నారదుడు రామకథ నంతను ఉపదేశించెను. ఇదియే సంక్షేపరామాయణము. ఇది శ్రీరామాయణములోని మొదటిసర్గ. ఈసర్గను పారాయణము చేసినచో రామాయణము పూర్తిగ పారాయణ చేసిన ఫలితము సిద్ధించును.

రామాయణము గాయత్రీ మంత్రమును ప్రతిపాదించునని నిరూపించుటకు నారదుడు ఉపదేశించిన ఈ బాలరామాయణము గాయత్రీ మంత్రముయొక్క మొదటిఅక్షరముతో ప్రారంభమై చివరిఅక్షరముతో సమాప్తమగును. "తపస్స్వాధ్యాయనిరతం" అనుచోట 'త' కారము గాయత్రీమంత్రముయొక్క ఆద్యక్షరము. ఈ సర్గ చివరి శ్లోకము "జనశ్చ శూద్రోఽపి మహత్త్వ మీయాత్" దానిలోని 'యాత్' అను అక్షరముతో అంతమగును. ఇది గాయత్రీమంత్రముయొక్క చివరి అక్షరము. దీనిని చదువుటచే గాయత్రీమంత్రము చేసిన ఫలితము కలుగును.